# సపతీకృత

రచన:
శ్రీ కోపల్లె రామారావు

(గతసంచిక తరువాయి)

భారతీభాస్కర్‌లు కృష్ణా బ్యారేజిమీద ఒక శుభ్రమయిన స్థలంచూచుకుని చేతిరుమాళ్ళు పరుచుకు కూర్చున్నారు. బ్యారేజికి ఇరు ప్రక్కల కాంతివంతంగా వెలుగుతున్నాయి లైట్లు. ఆ వెలుగు కృష్ణానదిలో ప్రతిఫలించుతూ ఎంతో అందాన్ని గలుగుచేస్తున్నాయి.

తప్పని సరిగ భారతి బలవంతం చేయడంచేత వచ్చాడేగాని భాస్కర్ మనసు అక్కడలేదు. ఎక్కడో విహరిస్తోంది. భాస్కర్ పరధ్యానాన్ని గమనించింది భారతి. ఆమె తన మనస్సులోని అనుమానం నివృత్తి చేసుకోడానికి ఇదే సమయం అనుకుంది.

ఏమండీ ఏమిటాలోచిస్తున్నారు అని అడిగింది భారతి. అబ్బే ఏమీ లేదండీ. ఆ దంపతులను చూడండి. ఎంత హాయిగా నిర్మలంగా నవ్వుకుంటున్నారో, అంత అదృష్టం అందరికీ ఎందుకివ్వడో గదా అని ఆలోచిస్తున్నాను, అని సమాధాన మిచ్చాడు భాస్కర్, ఏమండీ మిమ్మల్ని ఒక మాటడగాలని చాలా కాలం నుంచి అడుగుదామని అనుకుంటున్నాను. అడగమంటారా? అని ప్రశ్నించింది భారతి.

అడగండి చెబుతాను అన్నాడతడు.

అహ ఏమీ లేదు. మిమ్మల్ని చూస్తే ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ కనబడతారు. మీరు ఇంతవరకు మేరేజి చేసుకోకపోవడానికి కారణం ఏమిటి? అంటూ అతని ముఖంలోనికి చూచింది.

అప్పటిదాకా నిర్మలంగా ఉన్న అదని ముఖం నల్లబడింది:

అయామ్ సారీ. మీకు బాధ కలుగుతుందనుకోలేదు. క్షమించండి.... అంది భారతి.

పర్వాలేదులెండి. కానీ నా కథచెబుతే వినే ఓపిక ఉందా మీకు అని అడిగాడు భాస్కర్.

చెప్పండి అంటూ కుతూహలంగా ముందుకు వంగి కూర్చుంది భారతి.

* * *

మాది బందరు తాలూకాలోని ఒక చిన్న పల్లెటూరు గ్రామంలోని మర్యాదగల కుటుంబాలలో మాదికూడా ఒకటి. మా నాన్నగారు చిన్నతనంలోనే చనిపోవడంచేత ఉన్న అయిదు ఎకరాలమాగాణీ భూమిని మా మామయ్య విశ్వనాథంగారే చూచేవారు. ఆయన అజమాయిషీక్రిందనే నే హైస్కూలు చదువు పూర్తి చేశాను.

మామయ్య ఆఊరి మోతుబరి రైతులలో ఒకడు. అరవయి ఎకరాలభూమికి ఆసామి. ఆయనకు ఒక్కతే కుమార్తె శ్యామల. పేరుకు తగ్గట్టుగానే నల్లగా ఉండేది. కానీ ఎంతోకళగా అందంగా ఉండేది. నాకంటే నాల్గు సంవత్సరాలు చిన్నది.

శ్యామల పుట్టినప్పటనుంచీ సాభార్య అని అంతా అనుకునేవారు. మేమిద్దరం చిన్నప్పటినుంచి ఎంతో ఆదరాభిమానాలు గలిగి ఇష్టంగా ఉండేవాళ్ళం. మా ఇద్దరిమధ్యా ఏవైనాచిలిపితగవులు వచ్చినపుడు శ్యామల మా అమ్మమ్మకి పిర్యాదుచేస్తే పర్వాలేదు లేవే నీ మొగుడు నిన్నేడిపించకపోతే ఇంకెవరి యేడిపిస్తాడు అనేది.

పోమామ్మా నువ్వెప్పుడూ ఇంతే బావనే వెనకేసుకొస్తావు అని పారిపోయేది.

నేను దొడ్లో జామిచెట్టెక్కి కాయిలు తింటుంటే బావా నాకుకూడా కోసివ్వవా అని అడిగేది. నిన్నే పెళ్ళిచేసుకుంటాను బావా అని శ్యామల నోటితో అనిపించుకొని కాయలుకోసిచ్చి బుగ్గనుముద్దాడి మురిసిపోయేవాడిని. ఒకళ్ళపై మరొకరు పంచప్రాణాలుంచుకొని పెరిగాము. కొద్దిసేపు ఆగాడు భాస్కర్.

కాలగమనంతో పాటుగా మానవులు జీవితగమనంలో కూడా మార్పులు తీసుకురావడం భగవంతుని దినచర్య.

ఇలా ఉండగా శ్యామల పెద్దమనిషి అయింది. మునుపటిలాగ శ్యామల నాతో ఆటలు ఆడటంలేదు. నేను వాళ్ళింటికి వెడితే నన్నుచూచి వాళ్ళమ్మదగ్గరకు తుఱ్ఱుమని పారిపోయేది. ఇంతలో శ్యామలకు మామయ్య సంబంధాలు వెతుకుతున్నాడనివిని నిశ్చేష్టుడనయ్యాను. నా మనసులోని మధురభాండం బ్రద్దలయింది. నా ఆశలన్నీ నిరాశలయ్యాయి. నామనసు తెలిసిన మా అమ్మ మామయ్యాని నోరుతెరిచి అడిగింది, అన్నయ్యా నీకు ఒక్కతే కుమార్తె. నాకు ఒక్కడే కొడుకు వారిద్దరూ

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

చిన్నప్పటినుంచి ఎంతో ఇష్టంగా ఉంటున్నారు. ఇద్దరికీ ముడిపెడితే మనకళ్ళ ఎదుటనే ఉంటారు. కానీ మామయ్య అంగీకరించలేదు. చెల్లెమ్మా భాస్కరం పని వాడు, అమాయకుడు పైగా వాడికున్న ఆస్తి ఎంత. కయ్యానికయినా వియ్యానికయినా సరిసమానమయిన అంతస్తుగలవారే ఉండాలి, బంగారంలాంటి పిల్లనీ లక్షాధికారిణి కావలసినపిల్లనీ నీ ఇంటికోడలు చేయమంటావా? వీలులేదన్నాడు మామయ్య. అప్పటినుంచీ మా రెండు కుటుంబాలమధ్య రాకపోకలు నశించిపోయాయి. కొన్నాళ్ళకి మామయ్య ఏదో లక్షాధికారుల సంబంధం నిర్ణయించి ముహూర్తం నిశ్చయించుకొచ్చారు. కానీ బంగారంవంటి శ్యామల రేపు ముహూర్తం అనగా నూతిలోపడి ఆత్మహత్యగావించుకుంది. ఆ సంపతరమే మా అమ్మ చనిపోవడంచేత ఆస్తి అంతా కౌలుకు ఇచ్చి ఖాళీగా ఉండటం ఇష్టంలేక రాజమండ్రిలో పి. యు. సిలో చేరాను. పి, యు, సిలో కష్టపడి ఫస్టుమార్కులు తెచ్చుకున్నాను. మార్కులుచూసి లెక్చరర్లంతా ఎమ్. బి.బి.ఎస్.కి వెళ్ళమన్నారె గానీ నాకు ఇష్టంలేక బి. యి.కి వెళ్ళాలని నిశ్చయించుకున్నాను.

బి. యి. సెకండుక్లాస్‌లో ప్యాసయ్యి ఇక్కడ ఉద్యోగం చేస్తున్నాను. ఇదీ నాకథ. అర్థమయ్యిందా? ఆ సంఘటన నా హృదయానికి గొడ్డలిదెబ్బ అందుచేతనే అప్పటినుంచీ ఏ యువతితోనూ పరిచయాన్ని పెంచుకోవడం నాకిష్టంలేదు. ఆడవారికి ఆమడదూరంలో ఉంటున్నాను. అని నిట్టూర్చి మొహానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు భాస్కర్. వెంటనే చేతినున్న వాచీలో టయించూచుకొని భారతీ పదయింది వెండి వెళదాము అన్నాడు భాస్కర్.

వెళదాము కానీండి ఈ ఒక్క ప్రశ్నకు జవాబు ఇవ్వండి. ఏ స్త్రీయైనా మిమ్మల్ని ప్రేమిస్తే మననిస్తారా అని అడిగింది భారతి,

అసంభవం. భ్రాంతి ఇక ఈ ఎండినమ్రానుకు వసంతం ఉండదు. ఉండకూడదు. అని ఆవేశంగా సమాధాన మిచ్చాడు భాస్కర్.

మౌనంగా ఇంటికి చేరుకున్నారు భారతీ భాస్కర్‌లు.

* * *

అదమరచి నిద్రిస్తున్న భాస్కర్ శాంతమ్మ కేకలువిని హడావిడిగాలేచి బయటకొచ్చాడు. నాయనా భాస్కరం భారతి ఇల్లంతా వెదికినా కన్పించలేదు. ఈ ఉత్తరం ఏదో దానిమంచంమీద ఉంది చదువు నాయనా అన్నదామె ఆదుర్దాగా. ఒణికే చేతులతో అందుకున్నాడు భాస్కర్. అందులో ఇలా ఉంది.

పూజ్యుల భాస్కర్ గార్కి,

మీకేమీ తెలియకుండానే మీరూపం నన్ను ఆకర్షించింది. మీ ప్రవర్తన నిరాడంబరం నా హృదయాన్ని ఆకట్టుకున్నాయి. కానీ మీ పాదదాసిగా సేవచేయాలనే నా ఆశనిరాశయని రాత్రి తెలుసుకున్నాను. ఇంక నేను జీవించి ఉండటం వృధా. మరుజన్మలోనయినా మిమ్మల్ని భర్తగాకూర్చమని భగవంతుని ప్రార్థిస్తున్నాను. అరున్నరలోగా మీరునన్ను చేపట్టడానికంగీకరించి కృష్ణ ఒడ్డునకు వస్తారని ఆశతో ఎదురుచూస్తాను. లేనిచో నా మృతదేహం కృష్ణలో తేలియాడుతుంది.

ఇట్లు,
అభాగిని,
భారతి,

అప్రయత్నంగా భాస్కర్ చూపులు చేతినున్న గడియారంపైకి వెళ్ళాయి. ఆరుగంటలు చూపుతున్నది రేడియండయలు వాచి. వెంటనే భారతిని తీసుకురావడానికి జీపును శరవేగంతో కృష్ణ ఒడ్డుకు పరుగెత్తించాడు.

* * *

ఒక శుభముహూర్తాన మిస్ భారతి తిరుమల తిరుపతి వెంకటేశ్వరుని సన్నిధిలో మిసెస్ భారతీ భాస్కర్‌గా మారింది. తనపంతం నెగ్గించుకుని సఫలీకృతరాలయింది.

